
ప్రజాశక్తి

సోమవారం 27 మే 2024 | 5 | విజయనగరం



రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోట జంక్షన్ వద్ద ఉన్న విజయ బ్లడ్ బ్యాంకులో ఏర్పాటుచేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని హలో కిడ్స్ ఎమ్‌డి కోలగట్ల ప్రతాప్ ప్రారంభించారు. జిల్లాలో ఉన్న తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ డయాలసిస్, గర్భిణులు, రక్తహీనత, కేన్సర్ పేషెంట్లకు రక్త కొరత కారణంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇబ్రహీమ్ తెలిపారు. ఈ శిబిరంలో 86 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి కుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, విజయ్, రఘు, వినయ్, వికాస్, రమ్య, రాజు, విజయ దుర్గ ఫౌండర్ కె.చంద్రిక, విహెచ్‌ఓ ఫౌండర్ రాము, అరవింద్, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరందేనా?

- ఆధునీకరణ, పూడికతీత పనులకు నోచుకోని మడ్డువలస కాలువలు
- గేట్ల లీకులతో నీరు వృథా
- రైతులకు ఏటా తప్పని సాగునీటి కష్టాలు



రూపుకోల్పోయిన ఎడమ కాలువ



గేట్ల నుంచి లీకులు

వారంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతోంది. అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో రైతులు కూడా పొలాల్లో దుక్కులు చేసి ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వర్షంతో సంబంధం లేకుండా మడ్డువలస ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. అటువంటి కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో ముళ్లపొదలు, చెట్లు, చెత్తా చెదారంతో పూడికలు పేరుకుపోయాయి. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నా కనీసం పూడికతీత పనులు కూడా చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు మడ్డువలస ప్రాజెక్టు ఆయకట్టుకు సక్రమంగా సాగునీరందేనా? అన్న సందేహం రైతుల్లో వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములునాయుడు మడ్డువలస ప్రాజెక్టు నుంచి వంగర, రేగిడి, సంతకవిటి మండలాలతోపాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, లావేరు మండలాల పరిధిలో 37,377 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అందులో మొదటి దశలో వంగర మండలంలో 996, రేగిడి మండలంలో 6,777, సంతకవిటి మండలంలో 10,976, జి.సిగడాం మండలంలో 6029, పొందూరు మండలంలో 99 ఎకరాలకు.. మొత్తం 24,877 ఎకరాలకు నీరివ్వాలని నిర్ణయించారు. స్టేజ్-2లో జి.సిగడాం మండలంలో 536, పొందూరు మండలంలో 5173, లావేరు మండలంలో 5474, ఎచ్చెర్ల మండలంలో 1317 ఎకరాలకు.. మొత్తం 12,50గెకరాలకు సాగునీరు అందించాలన్నది ఉద్దేశం. ప్రాజెక్టు ప్రారంభమై 20 ఏళ్లు గడిచినా ప్రధాన కాలువల ఆధునీకరణ పనులు నేటికీ చేపట్టలేదు. పిల్ల కాలువల పరిస్థితి పూర్తిగా అధ్వానంగా ఉంది. దీంతో రైతులకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

లీకులతో సాగునీరు వృథా

మడ్డువలస ప్రాజెక్టు ప్రధాన గేట్లకు లీకులు కావడంతో కొన్నేళ్లుగా సాగునీరు వృథాగా పోతుంది. ఈ లీకులను అరికట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. దీంతో లీకుల ద్వారా దిగువకు సాగునీరంతా వృథాగా పోవడం వల్ల నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను, పూడికలను తీస్తే తప్ప ఈ ఏడాది ఖరీఫ్‌కు నీరందడం కష్టమని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం ఆ దిశగా పనులు చేపట్టడం లేదు. వాస్తవానికి ఈ వేసవిలో కాలువల్లో ఉన్న పూడికలు తొలగించి ఖరీఫ్‌కు ఎటువంటి ఆటంకమూ లేకుండా సాగునీటికి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. కానీ అధికారులు కాలువ పనులపై దృష్టి పెట్టలేదు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా పట్టడం లేదు

ఎడమ కాలువ గట్లు చాలా బలహీనంగా ఉన్నాయి. సాగునీరు విడిచి పెట్టే సమయంలో గట్లు గండి పడటం వల్ల పంటనష్టం కూడా జరిగి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయం అధికారు లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– పోలిరెడ్డి చంద్రినాయుడు, రైతు, మగ్గూరు

ప్రతిపాదనలు పంపించాం



ఎడమ కాలువలో పేరుకుపోయిన పూడిక తీతలకు ప్రతిపాదనను పంపించాం. ఆమోదం వచ్చిన వెంటనే పనులు చేపడతాం. కుడి కాలువకు సంబంధించి రేగిడి, సంతకవిటి మండలాల వద్ద ఉపాధి హామీ పనుల ద్వారా పూడికతీత పనులు చేపడుతున్నాం.

– పి.అర్జున్, మడ్డువలస ప్రాజెక్టు డిఇఇ

ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేస్తున్న మోడీ

- ప్రశ్నించని కేంద్ర ఎన్నికల సంఘం
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌కు ఇరు పార్టీలదీ బాధ్యతే
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు




మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రజలను మరోసారి మోసగించి అధికారంలోకి వచ్చేందుకు ప్రధాని మోడీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేస్తున్నారని, ఇందుకోసం మోడీ, బిజెపి నాయకులు ఎన్ని అడ్డదారులు తొక్కినా కేంద్ర ఎన్నికల సంఘం ప్రశ్నించడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. అలాగే రాష్ట్రంలో అమలు చేస్తున్న ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు వైసిపి, టిడిపి ఇరు పార్టీలూ బాధ్యత వహించాలన్నారు. 'మళ్లీ కలుద్దాం' అంటూ పార్వతీపురంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆదివారం గెట్ టుగెదర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఫలితాల మాట ఎలా ఉన్నా విప్లవ స్ఫూర్తితో పనిచేయాలని పునరుద్ఘాటించారు. ఎన్నికల్లో అడ్డదారుల్లో గట్టెక్కేందుకు వైసిపి, టిడిపి డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేశాయని విమర్శించారు. సిపిఎం అందుకు భిన్నంగా ప్రజల నుంచి ఓట్లతో పాటు ఎన్నికల ఖర్చులకు విరాళాలు సేకరించిందన్నారు. ఆ మూడు పార్టీలూ డబ్బులు పెట్టి జన్నాన్ని పోగేసి ప్రచారం చేస్తే, సిపిఎం కార్యకర్తలు, అభిమానులు, ఇండియా వేదికను బలపరిచే వారు, అనేక సంఘాల నాయకులు స్వచ్ఛందంగా పనిచేశారని వివరించారు. ఇందులో భాగంగానే కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ కూడా సిపిఎం అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారన్నారు. గతంలో కురుపాం గెలిచి, ఆ తర్వాత ఓడిపోయినప్పటికీ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని గుర్తు చేశారు. బిజెపి, మోడీ తప్పులను ఎన్నికల సంఘం ప్రశ్నించడం లేదని విమర్శించారు. క్విడ్ ప్రోకోకు పాల్పడుతోందని విమర్శించారు. మోడీ అవినీతి బయటకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఈ విషయాన్ని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు తేటతెల్లం చేసిందన్నారు. పౌర హక్కుల విషయంలో రాజీపడకుండా తీర్పులివ్వడం అభినందనీయమన్నారు. బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే కోర్టులపై కుడా పెత్తనం చెలాయించే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. కౌంటింగ్ ముగిశాక ఎన్నికల్లో ఓట్ల వివరాలు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. మోడీ, బిజెపి నాయకులు ఎన్నికల్లో మ్యాన్‌ప్లేట్ చేసి, ఫలితాలు తారుమారు చేయడంలో సిద్ధహస్తులని విమర్శించారు. కేంద్రంలో తిరిగి ఎన్‌డిఎ కూటమి గెలిస్తే మన రాష్ట్రానికి మరోసారి శని పట్టినట్టేనన్నారు. అదే జరిగితే ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణపై పోరాడే భాధ్యత కమ్యూనిస్టులదేన్నారు. అందుకు శ్రేణులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా, వారు ఇచ్చిన వాగ్దానాలను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. కార్పొరేట్లకు సులువుగా భూములు బదలించేందుకే ఈ చట్టం చేస్తున్నారని నీతి అయోగ్ స్పష్టంగానే చెప్పిందని గుర్తు చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు వైసిపి, టిడిపి బాధ్యులేనన్నారు. కేంద్రం చేసిన ఈ చట్టాన్ని రెండు పార్టీలూ పార్లమెంట్‌లో బలపర్చాయని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని వ్యతిరేకించింది కేవలం సిపిఎం ఒక్కటేనన్నారు. చిత్తశుద్ధి ఉంటే కేరళ తరహా అభివృద్ధి చేయాలని సూచించారు. ఎంతో ఆదర్శవంతమైన బుద్ధిజం మతాన్ని నాశనం చేసినవారే నేడు గతంలో ముస్లిం, క్రిస్టియన్ మతాలను అంతమొందించేందుకు ప్రయత్నిస్తున్నారని బిజెపిని విమర్శించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా గుర్తించిన ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనరస మాట్లాడుతూ స్పష్టమైన రాజకీయ విధానంతో సిపిఎం పోటీ చేసిందన్నారు. సిపిఎం కురుపాం ఎంఎల్‌ఎ అభ్యర్థి మండగి రమణ మాట్లాడుతూ గెలుపోటములతో నిమిత్తం లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి పాటు పడతానని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం, పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు.

సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణను రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడు తున్న తమ్మినేని నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. పరామర్శించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ ఉన్నారు.



తమ్మినేని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాసరావు



క్రెడాయ్ భవనాన్ని ప్రారంభిస్తున్న శేఖర్‌రెడ్డి, రాజా శ్రీనివాస్

క్రెడాయ్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక ధర్మపురి వద్దనున్న వసంత విహార్ లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన క్రెడాయ్ భవనాన్ని ఆదివారం క్రెడాయ్ జాతీయ మాజీ అధ్యక్షులు సి.శేఖరరెడ్డి, సహాయ కార్యదర్శి బి.రాజా శ్రీనివాస్, రాష్ట్ర చైర్మన్ ఎ.శివారెడ్డి, అధ్యక్షులు ఎన్‌వి రమణారావు, ప్రధాన కార్యదర్శి పాయల శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రెడాయ్ విజయనగరం చరిత్రలో మంచి రోజుగా భావిస్తున్నామన్నారు. రెగ్యులర్ సమావేశాలు నిర్వహించి, స్కిల్ డెవలప్‌మెంట్, నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులపై చర్చించేందుకు ఒక వేదిక అవసరమని తెలిపారు. ఆ దిశగా నూతన భవనాన్ని నిర్మించినందుకు జిల్లా సభ్యులకు అభినందనలు తెలిపారు. దేశంలో 25 వేల మంది సభ్యులున్న క్రెడాయ్.. ఉద్యోగ కల్పనలో రెండో స్థానంలో ఉందన్నారు. 250 పరిశ్రమలు తమపై ఆధారపడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రబోస్, జిల్లా చైర్మన్ వి.పార్థసారథి, మాజీ అధ్యక్షులు సూర్యనారాయణ రాజు, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుపై ఆర్‌ఒ ఆరా?

నాణ్యత లేని భోజనం, బూత్ ఖర్చుల్లో కోత ● తహశీల్దార్ తీరుపై అసంతృప్తి

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ ఎన్నికల ఖర్చుపై ఆర్వో విష్ణు చరణ్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో ఖర్చులకు సంబంధించి సమగ్ర వివరాలు కోరినట్లు సమాచారం. నియోజకవర్గానికి ఎన్నికల ఖర్చు నిమిత్తం సుమారు రూ.రెండు కోట్లు పైనే నిధులు మంజూరయ్యాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నుంచి పోలింగ్ వరకు అయ్యే ఖర్చులకు నిధులు మంజూరవుతాయి. పోలింగ్ నిర్వహణకు సంబంధించి పిఒ, ఎపిఒ, ఒపిఒ, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ శిక్షణా తరగతులు జరిగాయి. ఈ శిక్షణా సమయంలో అధికారులు, సిబ్బందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం సదుపాయాలు ఏర్పాటు చేశారు. అయితే నాణ్యతలేని భోజనాలు పంపిణీ చేశారని కొంతమంది సిబ్బంది, అధికారులు అక్కడ భోజనం చేయలేదనే ఆరోపణలు వినిపించాయి. దీనిపై ఆర్వో విష్ణు చరణ్ కూడా తహశీల్దార్ సింహాచలంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎన్నికల ఏర్పాట్ల విషయంలో ఆయన వైఖరిని అనేకసార్లు తప్పు పట్టినట్లు తెలుస్తోంది. బూతుస్థాయి అధికారులకు నిబంధనల ప్రకారం ఒక్కో బూతు ఖర్చుకు రూ.8వేలు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ తహశీల్దార్ సింహాచలం ఒక్కో బూత్‌కు ఖర్చు నిమిత్తం మొదట రూ.2400 పంపిణీ చేయగా బిఎల్వోలు తీవ్రంగా వ్యతిరేకించడంతో రూ.4వేలు చెల్లించారు. నియోజకవర్గంలో మొత్తం 243 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. బూతుల ఖర్చు విషయంలోనే లక్షలాది రూపాయలు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా పిఒ, ఎపిఒ, ఒపిఒలకు చెల్లించాల్సిన డబ్బుల్లోనూ కోత విధించినట్లు గుసగుసలాడు కుంటున్నారు. వీడియోగ్రాఫర్లు, వాహనాలకు అద్దె చెల్లింపుల్లోనూ చేతివాటం ప్రదర్శించారనే ప్రచారం జరుగుతోంది. తహశీల్దార్ సింహాచలం ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు ఇక్కడికి బదిలీపై వచ్చారు. అంతవరకు మక్కువ మండల తహశీల్దార్‌గా ఉన్న ఆయన అనూహ్య రీతిలో సాలూరు తహశీల్దార్‌గా నియామకమవ్వడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. విశాఖ జిల్లా మధురవాడ నుంచి ఇక్కడికి తహశీల్దార్ ఆనంద్ కుమార్ బదిలీపై వచ్చారు. ఆనంద్ కుమార్‌ను మక్కువ బదిలీ చేసి అక్కడ ఉన్న సింహాచలాన్ని రాత్రికి రాత్రే సాలూరు బదిలీ చేయడం వెనుక పెద్ద లాబీయింగ్ జరిగినట్లు ఆ సమయంలో చర్చ జరిగింది.

క్రీడా శిక్షణకు విశేష స్పందన



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. విజయనగరంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలను ఈ నెల 15 నుంచి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తోంది. విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో బాక్సింగ్, విజ్జి స్టేడియంలో స్కేటింగ్, తైక్వాండో, రాజీవ్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, కొండవెలగాడలో వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో శిక్షణ శిబిరాలకు విద్యార్థులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. వీరికి ముందుగా అరగంటపాటు ఫిట్నెస్ కోసం వ్యాయామాలు చేయించడం, అనంతరం ఆయా క్రీడల్లో వారికి శిక్షణ ఇస్తున్నారు. బాక్సింగ్ శిబిరానికి సుమారుగా 50 మందికి పైగా హాజరవుతున్నారు. రోజురోజుకూ ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుండటంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు క్రీడలకు ప్రోత్సహిస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిస కాకుండా ఉండేందుకు కూడా పిల్లలను వేసవి శిక్షణ శిబిరాలకు పంపిస్తున్నారు. అనుభవజ్ఞులైన శిక్షకులు ఉండటంతో క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

శిక్షణకు ఆదరణ

ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న ముగియడంతో శిక్షణ శిబిరాలను 15వ తేదీ నుంచి ప్రారంభించాం. ప్రారంభం నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇది చాలా ఆనందంగా ఉంది. ఐదు విభాగాల్లో కోచ్‌లు ఉండటంతో వారు ఫిట్నెస్, తర్వాత క్రీడలపై అవగాహన పెంచి అనంతరం వారిని మైదానాల్లో దించి ఆడిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. నాణ్యమైన క్రీడాకారులను తయారు చేసేందుకు, క్రీడలను ప్రోత్సహించేందుకు శిబిరాలు ఎంతో దోహదం పడుతున్నాయి. ఉన్న సమయాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.వెంకటేశ్వరరావు, డిఎస్‌డిఒ

మహిళా క్రికెట్ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్ : అండర్-16, 19, సీనియర్ జిల్లా మహిళా క్రికెట్ జట్ల ఎంపికను జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజ్జి స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మూడు విభాగాల్లో ఎంపికలకు 50 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. మూడు విభాగాల్లో జట్టుకు 15 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన జిల్లా జట్లు త్వరలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నాయి. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్‌ఎన్ రాజు, సెలెక్టర్లు పాల్గొన్నారు.

యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుదల

విజయనగరం కోట : యోగా ద్వారా జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చని సహజ యోగా ట్రస్ట్ సభ్యులు సూరిబాబు, రామారావు తెలిపారు. ఆదివారం విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో యోగాపై వారు శిక్షణ ఇచ్చారు. యోగాతో శరీర నియంత్రణ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాస్, భాష, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

వైఎస్ఆర్‌నగర్‌లో కార్డాన్ సెర్చ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని వైఎస్ఆర్ నగర్‌లో టుటౌన్ సిఐ కోరాడ రామారావు ఆధ్వర్యాన ఆదివారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, రికార్డులు సక్రమంగా లేని వాహనాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి ఇంటి పరిసరాల్లో, వీధుల్లో తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల్ని ప్రశ్నించి, వారు ఎవరింటికి, ఏ పని మీద వచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. వాహన రికార్డులు సక్రమంగా లేని 31 మోటారు సైకిళ్లను పోలీసుస్టేషనుకు తరలించారు. వాహన పత్రాలు చూపిన వాహనాల రికార్డులు పరిశీలించి, సక్రమంగా ఉంటే రిలీజ్ చేస్తామని సిఐ తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు దుర్గా ప్రసాద్, రాజేష్, ఎఎస్ఐ పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐతో ఉద్యోగావకాశాలు

రానున్న కాలం వృత్తివిద్యా కోర్సులదే



విజయనగరంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల

ప్రజాశక్తి-విజయనగరం కోట

యువతకు వృత్తివిద్య కోర్సుల్లో శిక్షణ నైపుణ్యాన్ని అందిస్తూ స్వయం ఉపాధి, ప్రభుత్వ , ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు సాధించడంలో పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లు ప్రస్తుతం మంచి అవకాశాలను అందిస్తున్నాయి. ఐటిఐలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటుగా పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణను ఇస్తున్నాయి. అవసరమైన మెలకువలను విద్యార్థులకు నేర్పిస్తూ ఆ కోర్సులపై పూర్తి పట్టు సాధించేలా చేస్తున్నారు. అందువలన ప్రస్తుతం పారిశ్రామిక రంగంలో ఐటిఐ విద్యార్థులకు అనేక కంపెనీలలో ఉద్యోగాలు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఐటిఐ కోర్సులు చేస్తున్న విద్యార్థులకు వత్తి విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఐటిఐలో అనేక కోర్సులు

10వ తరగతి విద్యా అర్హతతో రెండు సంవత్సరాల కోర్సు చేసేందుకు, అదేవిధంగా ఒక సంవత్సరం కోర్సు చేసేందుకు విజయనగరం జిల్లా పరిధిలో మూడు ప్రభుత్వ, 25 ప్రైవేట్ ఐటి ఐ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఐటిఐ కళాశాలలు విజయనగరం, బొబ్బిలి, రాజాం పట్టణాల్లో ఉండగా, జిల్లా కేంద్రంలో 6, కొత్తవలస మండలంలో 5, బొబ్బిలిలో 3, గజపతినగరంలో 2, ఎల్.కోటలో 2, ఎస్.కోట, రామభద్రపురం, గరివిడి, చీపురుపల్లి, రాజాం, జామి, నరవ గ్రామాల్లో ఒక్కొక్క ఐటిఐ ఉన్నాయి. మూడు ప్రభుత్వ ఐటిఐల్లో వివిధ కోర్సుల్లో 632 సీట్లు ఉండగా, ప్రైవేట్ ఐటిఐలలో 4124 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఐటిఐ లో రెండేళ్ల కోర్సు వివరాలు

పదోతరగతి విద్యార్హతతో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, టర్నర్, మెషినిస్ట్, మెకానిక్ మోటర్ వెహికల్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎఒ కెమికల్, సర్వేయర్, పెయింటర్ కోర్సులు ఉన్నాయి. అదే విద్య అర్హతతో ఒక్క ఏడాది గల ట్రేడ్లు .. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రాం మింగ్ అసిస్టెంట్, షీట్ మెటల్ వర్కర్, కార్పెంటర్, డ్రెస్ మేకింగ్, డీజిల్ మెకానిక్, ఫైర్ టెక్నాలజీ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ మేనేజ్మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఎనిమిదవ తరగతి ఫెయిల్ లేదా పాస్ విద్య అర్హతతో ఉన్న ఒక సంవత్సరం ట్రేడ్ వెల్డర్ కోర్సు ఉంది.

ఉద్యోగ ఉపాధి అవకాశాలు అధికంగా

ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ కళాశాలలో శిక్షణ పొంది అప్రెంటిషిప్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు అధికంగా పొందుతున్నారు. స్థానిక ఐటిఐ లోనే కొన్నేళ్లుగా ప్రాంగణ ఎంపిక మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. దీంతో యువత ఐటిఐ వృత్తి కోర్సులు వైపు చూస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి అప్రెంటిస్ మేళాలు నిర్వహిస్తున్నారు. వారికి శిక్షణ కాలంలో పదివేలు స్టైఫండ్ రూపేనా అందిస్తున్నారు. ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులకు చెన్నైలోని టివిఎస్ షో రూమ్ లోనూ, హైదరాబాదులోని రేడియంట్ ఎలక్ట్రానిక్స్, క్యూసిఇవి టెక్నాలజీస్ ఫర్ ఇఒ వెహికల్స్, కడపలో షిరిడి సాయి ఎలక్ట్రానిక్స్, హైదరాబాదులోని మేదో సెర్వో ఇండియా లిమిటెడ్, హెచ్ బి ఎల్ బ్యాటరీస్, డెక్కన్ ఫెర్రో, ఎల్‌అండ్‌టి సంస్థ, విజయనగర్ బయోటెక్, జయభేరి, టాటా మోటార్స్, వరుణ్ మోటార్స్ వంటి సంస్థలతో పాటు మరెన్నో సంస్థల్లో ఉద్యోగ అప్రెంటిస్ అవకాశాలను అందిస్తున్నాయి.



శిక్షణ పొందుతున్న ఐటిఐ విద్యార్థులు

కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో అవకాశాలు

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, స్టీల్ ప్లాంట్, నావెల్, హిందుస్థాన్ ఏరోనాటికల్స్, డిఆర్‌డిఒ తదితర సంస్థల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఐటిఐ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు లిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ ఇలా

అభ్యర్థులు ఐటిఐ కోర్సుల్లో చేరేందుకు తమ పేర్లను iti.ap.gov.in వెబ్ సైట్‌లో జూన్ 10 రాత్రి 11.59నిమిషాల లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలో ఉన్న ఏదైనా ప్రభుత్వ ఐటిఐలో తప్పనిసరిగా వెరిఫికేషన్ చేసుకోవాలి. వెరిఫికేషన్ అవ్వని అభ్యర్థులు మెరిట్ లిస్ట్ జాబితాలో ఉండరు. దీంతో ఇంటర్వ్యూకు అనుమతి ఉండదు.

ఐటిఐ విద్యార్థులదే ఉన్నత భవిత



ప్రస్తుతం ఐటి సెక్టారు రంగంతో ఏదైనా పోటీ పడుతుందంటే అది ఐటిఐ రంగం ఒక్కటేనని విజయనగరం ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ టివి గిరి అన్నారు. ఐటిఐలో శిక్షణ పొందిన విద్యార్థులకు వందశాతం ప్లేస్మెంట్, అప్రెంటిస్ ఇవ్వబడుతుందన్నారు. అభ్యర్థులు ముఖ్యంగా ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నెంబరును మాత్రమే రిజిస్ట్రేషన్ సమయంలో ఇవ్వాలి అన్నారు. కోర్సు పూర్తయినంత వరకు అదే మొబైల్ నెంబర్ ఉంచుకోవాలని, అభ్యర్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, స్త్రీ, పురుష,(జెండర్) నాలుగు అంశాలు 10వ తరగతి సర్టిఫికెట్లు ఏ విధంగా అయితే ఉందో అదే విధంగా ఆధార్ కార్డులు కూడా ఉండేలాగా చూసుకోవాలని తెలిపారు.

కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కర్మాగారం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె నేటికి తొమ్మిదవ రోజుకు చేరింది. జిందాల్ కర్మాగారాన్ని యాజమాన్యం బేషరతుగా తెరిపించి కార్మికులందరికీ పని కల్పించాలని జిందాల్ టిఎన్‌టియుసి గౌరవ అధ్యక్షుడు పోలవర శెట్టి రాజన్న ఆదివారం కోరారు. కార్మికులకు ఎటువంటి సమాచారం లేకుండా జిందాల్ యాజమాన్యం కార్మికులను రోడ్డుపై నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లే ఆఫ్ ప్రకటించడాన్ని తప్పు బట్టారు. కంపెనీ మూసివేసి తొమ్మిది రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబాలతో సహా కార్మికులు ఏమి చేయాలో తోచని పరిస్థితిని, దుస్థితిని యాజమాన్యం తీసుకువచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. గత మూడు రోజుల నుంచి ఎస్.కోట టిడిపి అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సౌజన్యంతో వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పన్న పాలెం సర్పంచ్ కోన దేవుడు, జిందాల్ టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిభోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జాబితా విడుదల

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక ఎపి మోడల్ స్కూల్లో ఆరో తరగతిలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల జాబితాను ప్రిన్సిపల్ పార్వతి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జాబితాను పాఠశాల వద్ద ప్రదర్శించామన్నారు. ఇటీవలి పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. గతంలో ధ్రువపత్రాలు ఇవ్వని విద్యార్థులు వాటిని అందజేయాలని కోరారు.

బోధనేతర పనులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఉపాధ్యాయుల విద్యాబోధనకు ప్రధాన అడ్డంకిగా ఉన్న బోధనేతర పనులను ఎత్తివేయాలని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించిన ఫెడరేషన్ సమసవేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయిస్తేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులకు భోదించేందుకు ఉపాధ్యాయులకు సమయం ఉండేలా చూడాలని కోరారు. రాష్ట్ర నాయకులు జెసి రాజు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు పాఠశాల పాయింట్స్‌కె అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, భర్తీ చేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. మినిమమ్ టైం స్కేల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమ బద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి పద్మావతి, నాయకులు ప్రవీణ్, బి. దర్శనం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

300 మందికి దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని గొంగాడవలసలో ఆదివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనిల్ నీరుకొండ దంత వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 300మంది రోగులకు దంత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 200మందికి పుచ్చుపోయిన పళ్లు శుభ్రం చేసి సిమెంట్ అతికించారు. మరో 100మంది రోగులకు అత్యవసర చికిత్స కోసం విశాఖ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయికృష్ణ, శ్రీనివాసరావు, ప్రహర్ష, సమాజ వైద్య పరీక్షలు చేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

మెంటాడ: స్థానిక పిహెచ్‌సి వద్ద ఆదివారం జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధులు పాల్గొని కంటి చికిత్సలు చేయించుకున్నారు. ఆప్తమాలోజిస్ట్ డాక్టర్ అలేఖ్య 60 మందికి పరీక్షలు నిర్వహించగా 35 మంది కేటరాక్ట్ సర్జరీకి ఎంపికయ్యారు. వీరందరినీ శంకర్ ఫౌండేషన్ బస్ ద్వారా విశాఖపట్నం తీసుకొని వెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి తీసుకొని వస్తారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు సాయి కుమార్, సాయి రేవంత్, సభ్యులు అజయ్, ఆషిక్, శ్యామ్, క్యాంప్ కోఆర్డినేటర్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - కొత్తవలస

సార్వ త్రిక ఎన్నికలు సందర్భంగా, మండలంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా, డబ్బు, మద్యపానీయాలు ఒక చోటు నుండి ఇంకో చోటుకు రవాణా జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ. చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా కొత్తవలస జంక్షన్ లో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనాలు తనికీ చేస్తున్న సిబ్బందికి వాహన చోదకులు సహకరించాలన్నారు. ఎటువంటి రికార్డులూ లేని 13 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ సుదర్శన్ తెలిపారు.

24 వాహనాలు సీజ్

చీపురుపల్లి: చీపురుపల్లి సర్కిల్ పరిధిలో నిర్వహించిన పోలీస్ తనిఖీలలో 24 వాహనాలను సీజ్ చేసినట్లు చీపురుపల్లి ఎస్ఐ కె కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. ఆదివారం చీపురుపల్లి సిఐ షణ్ముఖరావు, గరివిడి ఎస్ఐలతో కలసి తనిఖీలు చేసామన్నారు. చీపురుపల్లి పరిధిలోని మెట్ట కాలనీ వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, కొత్త వ్యక్తులు రాకపోకలు సాగిస్తున్నారనే సమాచారం మేరకు కార్గెన్, సర్చ్ నిర్వహించి వాహనాలు తనిఖీలు చేశామని డాక్యుమెంట్లు లేకపోవడంతో 24 వాహనాలు సీజ్ చేసామన్నారు. ఇందులో 22 మోటారు సైకిళ్లతో పాటు రెండు ఆటోలను సీజ్ చేసామన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు హర్షం

వేపాడ: ఎట్టకేలకు సుప్రీమ్‌కోర్టు పోలీసు స్టేషన్‌లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడం హర్షనీయమని ఉత్తరాంధ్ర బహుజన సమాజ పార్టీ న్యాయ సలహాదారుడు కదిరి రాము అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరించి దళితులకు అన్యాయం చేస్తున్నారని ఈ సీసీ కెమెరాలు ఏర్పాటుతో కొంత మార్పు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

ఇవిఎం గోదాం వద్ద తుప్పలు తొలగింపు

నెల్లిమర్ల: స్థానిక ఇవిఎం గోదాం వద్ద ఆదివారం నగర పంచాయతీ సిబ్బంది కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో తుప్పలు, వ్యర్థాల తొలగించారు. గత కొన్ని నెలలుగా ఇవిఎం గోదాం పరిసరాల్లో తుప్పలు, వ్యర్థాల పెరిగిపోయి ఇబ్బందిగా ఉండడం తో వాటిని తొలగించే కార్యక్రమం నిర్వహించారు.

హైవేపై మద్యం షాప్‌ను తొలగించాలి

బొబ్బిలి: రాష్ట్రీయ రహదారిపై మద్యం షాపును తొలగించాలని గాంధీ స్మారక నిధి అధ్యక్షులు మింది విజయమోహన్ డిమాండ్ చేశారు. బొబ్బిలి-పార్వతీపురం రోడ్డులో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైవేపై ఉన్న మద్యం షాపును వేరే చోటకు తరలించి ప్రమాదాలను నివారించాలని కోరారు.

28న కోలగట్ల జన్మదిన వేడుకలు

విజయనగరం టౌన్ : ఈ నెల 28న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు వెల్లడించారు. ఆదివారం కోలగట్ల నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం స్థానిక సుజాత ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగళవారం అన్నదాన కార్యక్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు కుమ్మరి గంటి శ్రీనివాసరావు, మారం బాల బ్రహ్మారెడ్డి, రెడ్డి గురుమూర్తి, బోడ సింగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

పార్కు కార్మికుల జీతాలు హాంఫట్..?

● సెలవుల పేరిట మూడు నెలల వేతనాలు కోత ●లబోదిబోమంటున్న పార్కు కార్మికులు ● కట్ చేసిన సొమ్ములు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి- బొబ్బిలి

పార్కు కార్మికుల మూడు నెలల జీతాలను కాంట్రాక్టర్ హాంఫట్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పార్కు, యుద్ధ స్తంభం వద్ద ఉన్న గార్డెన్‌లో పిచ్చిమొక్కలు తొలగించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసేందుకు, కోటి చెరువు గట్టు, ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జ్యూట్ మిల్లు వరకు నాటిన మొక్కలకు నీరు పోసి మొక్కలను సంరక్షించేందుకు 16మంది కార్మికులను నియమించేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు కార్మికుల సరఫరాకు పట్టణానికి చెందిన ఒక కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ మున్సిపాలిటీ నుంచి బిల్లు వస్తేనే కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారు. దీంతో కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదు. కాగా మున్సిపల్ అధికారులు గత ఎనిమిది నెలల వేతనాలకు సంబంధించిన బిల్లులు చెల్లిస్తే ఐదు నెలల వేతనం చెల్లించి మూడు నెలల వేతనం సెలవులు కింద కట్ చేసి కాంట్రాక్టర్ హాంఫట్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మూడు నెలల వేతనాలు ఇవ్వకపోవడంతో ఎవరికి చెప్పాలో తెలియక కార్మికులు సతమతమవుతున్నారు.

మూడు నెలల జీతాలు సెలవులకు కట్ చేసిన కాంట్రాక్టర్

పార్కు కార్మికుల మూడు నెలల జీతాలు సెలవులు కింద కాంట్రాక్టర్ కట్ చేసి హాంఫట్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 12 నెలల జీతాలు 12మంది కార్మికులకు చెల్లించాల్సి ఉండగా మున్సిపల్ అధికారులు ఎనిమిది నెలల జీతాలు బిల్లు కాంట్రాక్టర్ కు చెల్లించారు. మూడు నెలల జీతాలను సెలవులు కింద కాంట్రాక్టర్ కట్ చేసుకుని పూర్తిగా ఇవ్వలేదని పేరు చెప్పేందుకు భయపడుతున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇస్తున్న అరకొర వేతనంలో మూడు నెలల జీతాలు సెలవులు కింద కట్ చేస్తే తాము కుటుంబాన్ని ఎలా పోషించాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

16మంది కార్మికులకు 12మందితో పనులు

పార్కు, యుద్ధం స్తంభం గార్డెన్, కోటి చెరువు గట్టుపై మొక్కలు, ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జ్యూట్ మిల్లు వరకు రోడ్డు డివైడర్ మొక్కలను సంరక్షించి నీరు పోసేందుకు 16మంది కార్మికులతో పనులు చేసి సూపర్ వైజర్‌కు రోజుకు రూ.600, మగ కార్మికునికి రోజుకు రూ.350, మహిళా కార్మికునికి రోజుకు రూ.200 చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 16మంది కార్మికులకు ఆమోదం తెలిపితే 12మంది కార్మికులతో పనులు చేసి 16మంది వేతనాలు బిల్లు చేసుకుని మున్సిపల్ నిధులను స్వాహా చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. 16మందిలో ఒక సూపర్ వైజర్, ముగ్గురు మగ కార్మికులు, 12మంది మహిళా కార్మికులు పని చేయాల్సి ఉండగా ఒక సూపర్ వైజర్, ముగ్గురు మగ కార్మికులు, ఎనిమిది మంది మహిళా కార్మికులు మాత్రమే పని చేస్తున్నారు. నలుగురు మహిళా కార్మికులు పని చేయకుండానే పని చేస్తున్నట్లు రికార్డులో నమోదు చేసి మున్సిపల్ నిధులను స్వాహా చేస్తున్నట్లు తెలుస్తుంది. అక్రమాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ మొక్కలకు నీరు పోయడానికే కార్మికులను నియమించారు..

సెలవుల వేతనం స్వాహా

ప్రతిరోజు 16మంది కార్మికులతో పని చేపించాలి. అత్యవసర పనుల కోసం ఒక కార్మికుడు సెలవు పెడితే ఆ కార్మికుడు స్థానంలో మరో వ్యక్తిని పెట్టుకుని పని చేపించి బిల్లు పెట్టాల్సి ఉన్న మరో కార్మికుడుని పెట్టకుండా బిల్లు పెట్టుకుని మున్సిపల్ నిధులను స్వాహా చేస్తున్నారు. పార్కు కార్మికుల వేతనాల్లో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వేతనాలు చెల్లింపుపై దర్యాప్తు

పార్కు కార్మికుల వేతనాలు చెల్లింపుపై సమగ్ర దర్యాప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. పార్కు కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్ పై ఉందన్నారు. మూడు నెలల వేతనాలు సెలవులు కింద కట్ చేసినట్లు తమ దృష్టికి రాలేదని, దర్యాప్తు చేసి కార్మికులకు న్యాయం చేస్తామన్నారు. మున్సిపల్ బిల్లు ఆలస్యమైనా కార్మికులకు సకాలంలో కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వాలన్నారు.

కళాశాల చదువుకు సిద్ధం

●అడ్మిషన్లపై ఉపాధ్యాయుల ప్రచారం
● ఎంపిసి, సిఇసి గ్రూపులతో ఈ ఏడాది తరగతుల ప్రారంభం

ప్రజాశక్తి - జామి

అది దశాబ్దాల నాటి కల..పేద విద్యార్థుల చదువుల సహకారానికి సార్థకమయ్యే ఆశ.. ఎందరో విద్యావంతుల అభిలాష.. మొత్తంగా జామి గ్రామంలో ప్రభుత్వ కాలేజీ చదువులకు సన్నద్ధమైంది. జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులకు రెండేళ్ల పాటు కాలేజీ చదువులు (ప్లస్ -2) అభ్యసించే అవకాశం రానే వచ్చింది. అయితే చదువు చెప్పే అధ్యాపకులు, ఇంటర్ చదువులకు కావాల్సిన సౌకర్యాలు సమకూరాల్సి ఉంది. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఇంటర్ చదివే విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేయనుకోవాలని ఉపాధ్యాయులు, అధికారులు కోరుతున్నారు.

మండలంలో 25 పంచాయతీలుండగా, అందులో మెజారిటీ ప్రజానీకం వ్యవసాయాధారిత కుటుంబాలే. మండలంతో పాటు ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ, గంట్యాడ మండలాల్లో అనేక గ్రామాలు మండల కేంద్రానికి అతి చేరువలో ఉంటాయి. విశాఖ జిల్లా పద్మనాభ మండలంలోని కొన్ని గ్రామాలు కూడా జామి మండల కేంద్రానికి సమీపాన ఉంటాయి. కానీ పదో తరగతి తర్వాత ఇంటర్ చదువులకు విజయనగరం, ఎస్.కోట, కొత్తవలస, విశాఖ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడుతోంది. కాబట్టి జామిలో జూనియర్ కాలేజి వస్తే, వేలాది మంది పేద విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కాలేజి అందుబాటులోకి వచ్చి ఉన్నత చదువులకు వీలు కలుగుతోందని ఆశపడ్డారు. అనుకున్నట్లే ఇంటర్ చదువులకు అవకాశం లభించింది. ఇప్పటికే 40 మందికి పైగా కాలేజీలో చేరినట్లు అధికారులు చెబుతున్నారు. కాలేజీ ప్రారంభంలో తక్కువ సీట్లు ఉంటాయి కాబట్టి, ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



అప్‌గ్రేడ్ అయిన పాఠశాల ఇదే..

భారమైన ఇంటర్ చదువులు

కార్పొరేట్ చదువులు కాలంలో ఇంటర్ చదవడం ఖర్చుతో కూడుకున్న పని. కనీసం రూ.50 వేలు నుంచి రూ. లక్ష మధ్య ఒక ఏడాది చదువుకు వెచ్చించాలి. రెండేళ్ల చదవడానికి అవకాశం లేక ఎక్కువ కుటుంబాల్లో ఆడపిల్లలను చదువులు ఆపేసి, పెళ్లిళ్ల చేస్తున్న పరిస్థితి. వ్యవసాయ కుటుంబాలలో అబ్బాయిలను పొలం పనులకు పంపుతున్న తీరు. ఈ నేపథ్యంలోనే మండల కేంద్రంలో ప్రభుత్వం జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయడంతో సొంత ఊరిలో ఇంటర్‌కు అవకాశం రావడం, పది తరువాత డ్రాపౌట్స్‌ను ఆపే అవకాశం ఉంది. ప్రతి పేద విద్యార్థి ఇంటర్ చదువును పూర్తి చేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కాలేజీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

జూనియర్ కాలేజీ సాధనకు జామిలో ఉద్యమమే జరిగిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వ విధానాల్లో భాగంగా ఇంటర్ చదువు ప్రభుత్వం మన బడిలోనే అందించేందుకు రంగం సిద్ధం చేసింది. మంచి అధ్యాపకులు, ఇంటర్ చదువులకు కావాల్సిన సౌకర్యాలు సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాబట్టి కాలేజీ అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, మేధావులు, పెద్దలు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలోనే మండల స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల సూచనలు సలహాలు స్వీకరించాల్సిన అవసరం లేకపోలేదు. కాలేజీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



గీసిన బొమ్మలతో విద్యార్థులు

పుస్తకాలతో విజ్ఞానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పుస్తకాల ద్వారా అనంతమైన విజ్ఞానం లభిస్తుందని శాఖ గ్రంథాలయాధికారి దామోదర్ శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల క్రాఫ్ట్ టీచర్ ఎ. రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు చదివించారు. కథలోని నీతిని విద్యార్థులకు వివరించారు. చదరంగంలో మెలకువలను నేర్పించారు. 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. దీనికి ముందుగా విద్యార్థులు కథలు పుస్తకాలు చదివారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టి తవ్వకానికి గురైన చెరువు

జోరుగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామంలో కోమటి చెరువు, ఊర చెరువు, కుంపల్లెలో రాజు చెరువు, పాటూరులో రా చెరువు, వేపాడలో తోము చెరువు, అరిగి పాలెంలోని గల చెరువులలో రాత్రి పూట జోరుగా మట్టి తవ్వకాలు చేసి తరలిస్తున్నారు. ఇదంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

ఓటు వేసేందుకు నిర్లక్ష్యమెందుకో?

●ఒక వైపు చైతన్యం.. మరో వైపు నిర్లిప్తత ●జిల్లాలో 2.83 లక్షల మంది ఓటుకు దూరం

ప్రజాశక్తి-చీపురుపల్లి

కొంత మంది ఓటు హక్కు తన బాధ్యతగాను, మరి కొందరు ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవాలన్న ఆలోచనతోను, ఇంకొందరు తమకు అన్యాయం జరుగుతోందనే ఆక్రోసంతోనో తమ ఓటు హక్కుని వినియోగించుకుంటారు. అయితే తాజాగా జరిగిన సాదారణ ఎన్నికలలో మాత్రం ఓటు హక్కు వినియోగించుకున్న వారి శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ కొంత మంది మాత్రం ఓటు వేసే విషయంలో అలక్ష్యం ప్రదర్శించారనే చెప్పాలి. ఈ నెల 13 జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసేందుకు వెల్లువిరిసిన చైతన్యం చూపించినప్పటికీ మరి కొంత మంది ఓటర్లు మాత్రం తమ విలువైన ఓటు హక్కుని వినియోగించుకోవడంలో అలసత్వం ప్రదర్శించారు.

జిల్లాలో 15,44,752 మంది ఓటర్లున్నారు. వీరిలో 12,61,151 మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2,83,601 మంది కీలక ఎన్నికల్లో విలువైన ఓటు హక్కుని మాత్రం వినియోగించుకోలేదు. ఈ సారి జరిగిన ఎన్నికలలో ఓటు వేసేందుకు దేశంలోని నలుమూలల ఉన్న ఓటర్లతో పాటు దేశ విదేశాల నుంచి వచ్చి మరీ ఓటు హక్కుని వినియోగించుకున్న వారున్నారు. తాము ఓటు వేయకపోతే ఏమైపోతుందిలే అనుకునే వారు కూడా జిల్లాలో ఉన్నారని తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయని వారి లేక్కే నిదర్శనం. తమ భవిష్యత్‌తో పాటు తమ పిల్లల భవిష్యత్, రాష్ట్ర భవిష్యత్‌ని నిర్ణయించే ఓటుని వేయకపోవడం అజ్ఞానమే అవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటుకు దూరమైన వారి వివరాలు

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. అందులో చీపురుపల్లి నియోజకవర్గంలో 2,05,484 మంది ఓటర్లుండగా 1,71,531 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఓటు వేయని వారు 33,953 మంది ఉన్నారు. రాజాం నియోజకవర్గంలో 2,27,484 మంది ఓటర్లుండగా 1,74,902 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఓటు హక్కుని వినియోగించుకోలేని వారు 54,582 మంది ఉన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో 2,31,222 మంది ఓటర్లుండగా 1,85,770 మంది ఓటు వేసారు, కాగా ఓటు వేయని వారు 45,452 మంది ఉన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో 2,05,466 మంది ఓటర్లుండగా 1,77,610 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. 27,856 మంది ఓటు హక్కుని వినియోగించుకోలేదు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 2,13,548 మంది ఓటర్లుండగా 1,88,455 మంది ఓటు వేసిన వారిలో ఉన్నారు. 25,093 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనలేదు. విజయనగరం నియోజకవరగంలో 2,39,075 మంది ఓటర్లుండగా 1,84,780 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారు. ఓటు హక్కుని వినియోగించుకోలేని వారు 54,295 మంది ఓటర్లున్నారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో 2,22,473 ఓటర్లుండగా ఓటుహక్కు వినియోగించుకున్నవారు 1,80,103 మంది కాగా 42,370 మంది ఓటు హక్కుని వినియోగించుకోలేదు.

నేటి నుంచి దారగంగమ్మ పండగ

● సోమవారం తొలేళ్లు, మంగళవారం అనుపు ●ఆలయం వద్ద భక్తులకు ఏర్పాట్లు ●పటిష్ట భద్రత నడుమ అమ్మవారి పండగ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

దేవాదాయ ధర్మాదాయ శాఖ పుణ్యగిరి దేవస్థానం పరిధిలో గల ఎస్‌కోట గ్రామదేవత శ్రీ దార గంగమ్మ పండగ రెండేళ్లకు ఒకసారి గ్రామ పెద్దలు ప్రజలు వైభవంగా జరుపుకుంటారు. అందులో భాగంగా ఈ నెల 20వ తారీఖున చాటింపు కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా సోమవారం తోలేళ్లు కార్యక్రమాన్ని మంగళవారం అత్యంత వైభవంగా అనుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ అనువంశిక పూజారి మోపాడ గౌరీ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి కె నాగేంద్ర మాట్లాడుతూ పండగ సందర్భంగా అమ్మవారి విగ్రహంతో పాటు ఆలయానికి రంగులు వేయించామని, భక్తుల దర్శనానికి బారీ కేడ్లను ఏర్పాటు చేశామని చెప్పారు. దర్శనానికి వచ్చే భక్తులకు మజ్జిగ, మంచినీరుతో పాటు ఉచిత ప్రసాద పంపిణీ చేస్తున్నామన్నారు. పండగ ఏర్పాట్లపై సిఐ మురళి మాట్లాడుతూ పండగ రెండు రోజులు రోజుకు 150 మంది చొప్పున పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇప్పటికే 200 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అనుపు రోజు పట్టణంలోకి వచ్చే వాహనాలకు అలంకార్ థియేటర్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామని, పండగ రెండు రోజులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఐదు మంది వీడియో గ్రాఫర్లు అనునిత్యం పండగను చిత్రీకరిస్తారని చెప్పారు. గ్రామ ప్రజలు బయటి నుండి వచ్చేవారు అందరూ సహకరించి పండగ జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆర్‌టిసి డిఎం రమేష్ మాట్లాడుతూ ధర్మవరం జామి రూట్‌లో తిరిగే బస్సులకు మండలంలోని తిమిడి గ్రామం మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్‌కి చేరుకునే విధంగా ఏర్పాటు చేశామని భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



విద్యుత్ కాంతుల నడుమ ఆలయ ప్రాంగణం

శిష్టకరణాల సంక్షేమానికి కృషి

సంఘం జాతీయ అధ్యక్షులు కృష్ణారావు

ప్రజాశక్తి- చీపురుపల్లి

శిష్టకరణ కుల సంక్షేమ కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని అఖిల భారత శిష్టకరణ జాతీయ అధ్యక్షుడు డబ్బీరు కృష్ణారావు అన్నారు. ఆదివారం చీపురుపల్లి వచ్చిన ఆయనను స్థానిక శిష్టకరణ సంక్షేమ సంఘం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిష్టకరణ కులస్తులు ఏకమై బిసి కేటగిరీని ఏవిధంగా సాధించుకున్నామో అదే విధంగా ఓబిసిని కూడా సాధించుకునేందుకు శిష్టకరణ కుల బంధువులందరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బంటుపల్లి రాంబాబు, విజయనగరం శిష్టకరణ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రేగువలస ఆనంద్‌పట్నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ ప్రభాత్‌కుమార్, చీపురుపల్లి అధ్యక్షుడు రఘుపాత్రుని శివప్రసాద్, ఉపాధ్యక్షుడు రఘుపాత్రుని శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకుమహంతి వేణు, ట్రెజరర్ కుప్పిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన బుకింగ్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రైల్వే స్టేషన్‌లో సోమవారం నుంచి నూతన బుకింగ్ కార్యాలయం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడో లైన్ పనుల్లో భాగంగా పాత బుకింగ్ కార్యాలయం కూలగొట్టడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నూతన బుకింగ్ కార్యాలయంలో టికెట్లు జారీ చేయడంతో పాటు రిజర్వేషన్లు చేయనున్నట్లు చెప్పారు. రైల్వే ప్రయాణికులు గమనించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

స్కూటీని ఢీకొన్న ఆటో.. పలువురికి గాయాలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద ఎదురెదురుగా ఆటో, స్కూటీ డీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలో హరిజన వీధికి చెందిన చింత బలరాం ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని సాలూరు వైపు వెళుతుండగా సాలూరు నుంచి స్కూటీ పై వస్తున్న పెద్దింటి చలపతి రావును ఢీ కొనడంతో చలపతి రావు, స్కూటీ వెనుక ఉన్న పాలక రాజీవు గాయపడ్డారు. వీరు పార్వతీపురం మండలానికి చెందినవారు. ఆటోలో ప్రయాణం చేస్తున్న పార్వతి, అనుష, అంకితలకు కూడా గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

కొత్తవలస: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కుడితి హరి కామేశ్వరరావు (50) జనవరి 8వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి కుడితి రమణమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరి కామేశ్వరరావుకు భార్యతో పాటు ఓ చిన్న కుమార్తె కూడా ఉందని ఆమె తెలిపారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బొండపల్లి

వ్యాను ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని అంబటివలస సమీపంలో క్రషర్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం రూరల్ మండలంలోని గుంకలాం గ్రామానికి చెందిన తాడ్డి తాతబాబు (35) అంబటివలస నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మినీ వ్యాను ఆయన్ను ఢీకొంది. దీంతో ఘటనా స్థలంలోనే ఆయన మరణించాడు. తాతబాబుకు భార్య చంద్రకళ, కుమారుడు లోకేష్ ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి ఆహ్వాన కరాటే పోటీల్లో ఆదిత్యా విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం విజయనగరం రాజీవ్ క్రీడా మైదానంలో 17వ రాష్ట్రస్థాయి ఆహ్వానపు కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన పిట్టా దేవిశ్రీ గోల్డ్ మెడల్, వసాది భూమికాశ్రద్ధ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా విశ్వ కింగ్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ కోచ్ మధు అనిషా రానున్న రోజుల్లో నేషనల్, రాష్ట్రస్థాయి విద్యార్థులు పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి. సూరిబాబు, అమృత విద్యార్థులను అభినందించారు.

విక్టరీ విద్యార్థుల ప్రతిభ

వేపాడ: విజయనగరంలో నిర్వహించిన కరాటే పోటీల్లో విక్టరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 13 సంవత్సరాల విభాగంలో పాల్గొన్న వి. స్నేహిత సిల్వర్ మెడల్, ఎ.యామిని బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ ఇద్దరూ తమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతు న్నారని స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ శివ ప్రసాద్ రాఘవ్ తెలిపారు. కరాటే కోచ్ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు రామును ఆయన అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు